RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 202 | జులై 08, 2025 | వెల : రూ.3-00



స్వర్ణకారులపై వేధింపులు మానుకోవాలి

4లో..

# వృక్షో రక్షతి రక్షితః

- మనం చెట్టును కాపాడితే..చెట్టు మనల్ని కాపాడుతుంది
- ప్రతి ఆడబిడ్డ ఇంట్లో కనీసం రెండు మొక్కలైనా నాటాలి
- సీఎం రేవంత్ రెడ్డి పిలుపు





**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రతి ఆడబిడ్డ ఇంట్లో కనీసం రెండు మొక్కలైనా నాటాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి ఆడబిడ్డ రెండు మొక్కలు నాటితే రాష్ట్రం ఆకుపచ్చ తెలంగాణగా మారుతుందని అన్నారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కను నాటి వన మహోత్సవం -2025 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అటవీ శాఖ, హెచ్ఎండీఏ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వన మహోత్సవం ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..ఈ ఏడాది అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలను నాటాలన్న బృహత్తర కార్యక్రమాన్ని తీసుకుని ముందుకు వెళుతున్నామన్నారు. మనం చెట్టును కాపాడితే, చెట్టు మనల్ని కాపాడుతుంది.

ఆడబిడ్డలు ఇంట్లో పిల్లలను పెంచుతున్నట్టుగానే ఇంటి ఆవరణలో కనీసం రెండు మొక్కలను నాటాలి. ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందని అనుభవంతో నేర్చుకున్న పాఠాలు. అమ్మ పేరు మీద పిల్లలు మొక్కలు నాటాలన్న తరహాలోనే పిల్లల కోసం అమ్మ కూడా రెండు మొక్కలు నాటాలి. అలా చేస్తే తెలంగాణ మొత్తం హరితవనంగా మారుతుందని తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నందునే ప్రభుత్వం అన్నింటిలోనూ వారికి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు, సోలార్ విద్యుత్ రంగంలో ప్రోత్సాహం, ఉచిత బస్సు

మిగతా 3వ పేజీలో..



## పడకేసిన పారిశుధ్యం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండలం లోని పలు గ్రామాలలో పారిశుధ్యం, వివిధ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచులు లేక ప్రత్యేక అధికారుల పాలనతో 18 నెలల పాటు సమస్యలు పేరుకపోయాయి. ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాక గ్రామపంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బుతో పంచాయతీ పాలన కొనసాగిస్తున్నారు. మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు మరి అప్పులు చేసి పంచాయతీ పరిపాలన సాగిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కార్యదర్శులకు ఎంతో కొంత జీతం వస్తే కుటుంబం పోషించడమే భారంగా ఉండడం వారికి బాధ్యతలు ప్రభుత్వం అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా మండలంలో కొన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం, వీధిలైట్లు మరిచారాన్ని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాలలో పారిశుధ్యం వికటించి డెంగ్యూ, మలేరియా బారినపడే అవకాశం లేకపోలేదు. మండలంలో పలు గ్రామాలలో సమస్యలపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట వీధిలైట్లు లేక రోడ్డుపై విష సర్పాలు సంచరిస్తూ ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## గ్రీవెన్స్ డే తో బాధితుల సమస్యలకు పరిష్కారం

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్.తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి,వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా,నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

3వ పేజీలో..

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

**వేద న్యూస్, గన్నేరువరం :**

గన్నేరువరం మండలంలోని గునుకులకొండాపూర్ లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నెహ్రూ చౌరస్తాకు సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్ద రోడ్డు బావిలోకి కుంగిపోయింది.అదృష్టవశాత్తు రాత్రిపూట ఏ భారీ వాహనం ఆ వైపుగా ప్రయాణం చేయకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఏదైనా వాహనం బావి పక్కనున్న రోడ్డు వెంట వెళ్ళినట్లయితే మొత్తం రోడ్డు కూలి బావిలోనే పడిపోవాల్సి వస్తుంది. ఉదయం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి రవి గౌడ్,లింగంపల్లి హరీష్ లు రోడ్డు పరిస్థితిని గమనించి దగ్గర్లో ఉన్న రాళ్లను, తాటి కమ్మలను రోడ్డు పై సూచికగా ఉంచారు.రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద రక్షణ గోడ నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీ కార్మికులు కర్రలతో రక్షణ ఏర్పాటు చేశారు. ఎన్నిసార్లు పలువురు నిరసన తెలిపినప్పటికీ కాంట్రాక్టర్ కు చీమకుట్టినట్టు కూడా లేదు. ఏదైనా ప్రమాదం జరిగి వాహనాలు బావులలో పడి ప్రాణాలు కోల్పోతే తప్ప అధికారులు నాయకులు కాంట్రాక్టర్ స్పందిస్తారో లేదో వేచి చూడాలి. ఇప్పటికైనా కాంట్రాక్టర్ పై అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు వెంట బావుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.






## టీబీ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి

- టీబీ నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళికతో చర్యలు చేపట్టాలి
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**వేద న్యూస్, హన్మకొండ :**

క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళికతో కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాలలో టీబీ ముక్త్ భారత్

మిగతా 3వ పేజీలో..

## ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వాల బిక్షా కాదు..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటీ శంకర్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల కాలంగా పెండింగ్ లో ఉన్నఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్షిప్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్షిప్స్ అనేది ఆర్థికంగా వెనుకబడిన పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యా అవకాశాలను అందించడానికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని అది ఎవరి బిక్ష కాదని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు ఉన్నత విద్య అందుకుని ఈ సమాజంలో ఉన్నతమైన స్థాయిలో ఉండటం ద్వారానే ఈ సమాజాభివృద్ధి సాధ్యమవుతుందిన్నారు. గత ఆరు సంవత్సరాల నుండి రూ.8000 కోట్లుపై ఫీజు రియంబర్స్ మెంట్ , స్కాలర్షిప్స్ రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఈరాష్ట్రంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిన విద్యార్థులకు స్కాలర్షిప్స్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అంతేకాకుండా భారత దేశంలోనే విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రం కేవలం తెలంగాణ రాష్ట్రం అన్నారు ప్రజా పాలన పేరు తో మాయ మాటలు చెప్పుతూ

మిగతా 3వ పేజీలో..

# శిథిలావస్థలో పాఠశాల భవనం

**- ప్రభుత్వాలు మారిన..మారని పాఠశాల దుస్థితి - బిక్కు బిక్కుమంటూ భయాందోళనలో విద్యార్థులు**





**వేద న్యూస్, భీమదేవరపల్లి :**

భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. పెచ్చులు ఊడిపడుతున్న శ్లాబ్, వర్షం వస్తే భవనంలో నీరు చేరుతుంది. చినుకు పడితే స్కూలు ఆవరణలో చిన్నపాటి చెరువును తలపిస్తుంది. దీంతో విద్యార్థుల భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 30మంది విద్యార్థులు ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. తలపై పైకప్పు ఉందా అనే అనుమానంతో తరగతులకే హాజరవుతున్నారు. మూడు గదుల పాఠశాల భవనం శ్లాబ్ నుంచి సిమెంట్ పొరలు ఊడిపడటంతో ఎప్పుడెప్పుడు ప్రమాదం జరిగేదోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- పట్టించుకోని అధికారులు -మారని దుస్థితి**

పలుమార్లు ఉన్నతాధికారులు, అప్పుడు వున్నా ఐఏఎస్ లు ఆమ్రపాలి, అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా అధికారులు పాఠశాలను సందర్శించినప్పటికీ, ఏ చర్యలూ తీసుకోకపోవడంతో తల్లిదండ్రులు నిరుత్సాహంగా ఉన్నారు. ప్రభుత్వాలు మారినా (బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వరకు), పాఠశాల పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించలేదని వాపోతున్నారు.

**- విలీన ఆదేశాలపై సందిగ్ధం**

ఇటీవల అధికారులు ఈ పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయాలని ఆదేశించగా, తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రక్కన ఉన్న గర్ల్స్ హాస్టల్ ఖాళీగా రెండు రూమ్స్ ఇవ్వాలని తల్లిదండ్రులు అడగాగ ఇవ్వని అధికారులు "అంత దూరంగా మా పిల్లలను పంపలేము. అవసరమైతే ప్రైవేట్ స్కూల్‌కి పంపుతాం, కానీ పిల్లల భద్రత మొదట," అని వారు ధీటుగా చెప్పారు.

**- భయాందోళనలో విద్యార్థులు - ప్రశ్నిస్తోన్న ప్రజలు**

సగం పైపెచ్చులు కూలిపోయిన భవనం, ఎప్పుడూ తడిగా ఉండే తరగతి గదులు, నీటిసేకరణ సమస్యల మధ్య పిల్లలు చదువుకునే పరిస్థితి లేదు. విద్యాభివృద్ధి పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రకటించే పాలకులు ముల్కనూర్ పాఠశాలపై మాత్రం కనీస దృష్టి పెట్టలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**- అధికారులు..స్పందించాలి!**

ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పిల్లల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. లేకపోతే, ఇది కేవలం మౌలిక వసతుల లోపమే కాక, నిస్సహాయ చిన్నారుల భవిష్యత్తుపై నేరమవుతుంది.

---

### పంచాయతీ కార్యదర్శుల

## సేవలు వెలికట్టలేనివి

**:ఆర్టిఐ పర్యవేక్షణ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అనంత చారి**



**వేద న్యూస్, డెస్క్:**

మండల వ్యాప్తంగా సర్పంచులు లేక పలు గ్రామాలలో చెత్త పేరుకపోయింది. గ్రామాలలో పనిచేసే సిబ్బందికి సక్రమంగా జీతాలు అందడం లేదు. అడపాదడపా వీధిలైట్లు వేసి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాలలో వీధిలైట్లు లేక రాత్రిపూట బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శుల అప్పులు చేసి పరిపాలన చేస్తున్నారు. మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల సేవలు వెలికట్టలేనివని అభిప్రాయపడుతున్నారు. వారికి ఎంతో ఎంతో జీతం వస్తే వారి కుటుంబం పోషించడమే కష్టంగా ఉండడంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కార్యదర్శిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరుతున్నాను.

### టీజేఎస్ యువజన సమితి

## జిల్లా అధ్యక్షునిగా భాను




**వేద న్యూస్, జమ్మికుంట:**

తెలంగాణ జనసమితి యూత్ విభాగం జిల్లా అధ్యక్షులుగా జమ్మికుంట పట్టణానికి చెందిన అరికిల్ల భానుచందర్ ని నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ధర్మార్జున్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు తెలిపారు. మొలంగూర్ గ్రామంలో సోమవారం జరిగిన జన సమితి జిల్లా ప్లీనరిలో జిల్లా కమిటీతో పాటు జిల్లా యువజన విభాగాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా భానుచందర్ మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రో. కోదండరాం సారధ్యం లో రాష్ట్రంలో,జిల్లాలో నిరుద్యోగ,యువత సమస్యలపై కొట్లాడటానికి ముందుంటానని,జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు,మహిళా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి,జిల్లా అధ్యక్షులు మోరే గణేష్, ,జిల్లా ఉపాధ్యక్షులు కర్రే సతీష్ యాదవ్ లకి కృతజ్ఞతలు తెలిపారు.

### స్తంభంపెల్లి హై లెవెల్

## వంతెన పూర్తి చేయండి

**– కలెక్టర్ కు వినతి పత్రం**





**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిననిపల్లి మండలం స్తంభంపెల్లి గ్రామంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కెనపెల్లి కరుణాకర్ మాట్లాడుతూ ప్రజావాణిలో చాలాసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెల్లినప్పటికీ స్తంభంపల్లి గ్రామానికి సంబంధించిన హై లెవెల్ వంతెన యొక్క పనులు పూర్తి కాకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా వర్షాకాలం మొదలవుతే ప్రయాణికులకు, రైతులకు, నిత్యం స్కూలుకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు, కూలీ నాలి పని చేసుకునేటువంటి ప్రజలకు చిన్నపాటి వర్షం పడడంతోనే ప్రవాహం ఉధృతమై కల్వర్టు దాటడానికి తీవ్ర ఇబ్బంది అవుతుందని చాలాసార్లు కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. చివరికి గ్రామ ప్రజలు పాదయాత్ర, బైక్ ర్యాలీలు చేస్తూ నిరసన తెలిపినప్పటికీ. అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చర్య తీసుకుని హై లెవెల్ వంతెన పనులు పూర్తి చేసే విధంగా సహకరించగలరని కలెక్టర్ కు వినతి పత్రం రూపకంగా వీలైనంత తొందరగా ఈ సమస్యకు పరిష్కారం చూపెట్టాలని స్థంభంపల్లి గ్రామ ప్రజలు మరియు పరిసర ప్రాంత ప్రజలు కోరుకోవడంతో కలెక్టర్ వెంటనే సంబంధిత పిఆర్ ఈఈ డిపార్ట్మెంట్ ను పిలిపించి పనులు పూర్తి అయ్యేలా ఆదేశించారు.

---

## ఘనంగా గోరింటాకు మహోత్సవం



**వేద న్యూస్, చొప్పదండి :**

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయంలో ఆషాడమాసమును పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప సేవా సమితి మహిళా సభ్యులు ఘనంగా గోరింటాకు పూజ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేష్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల నుండి ఎంతో వైభవంగా గోరింటాకు పండగ ఉత్సవాలను మహిళా సభ్యులు శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయం లో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గోరింటాకు పూజ మహోత్సవంలో పాల్గొన్న మహిళా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. హనుమాన్ భజ మండలి సభ్యులు భజన సంకీర్తనలతో ఆకట్టుకున్నారు. అనంతరం అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ బొడిగె వెంకన్న, ఎలిగేటి రామ లక్ష్మణ్, క్యాషియర్ దండె సత్యానంద్, పిట్టల సత్యం, మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మాజీ కౌన్సిలర్ దండే జమున, కొత్తూరు స్వతంత్ర భారతి, దండె రమ, దండే రాజయ్య, చీకట్ల లచ్చయ్య, గోపాల్ రెడ్డి, లక్ష్మణ్, బండారి వీరమల్లు, మహేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ చైతన్య పాఠశాలలను

## మూసివేయాలి..!




**– భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**

**వేద న్యూస్, వేములవాడ :**

వేములవాడ పట్టణంలో అనుమతులు లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను అలాగే ఇల్లంతకుంటలో ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలను ఈ రెండిటిని మూసివేయాలని జిల్లా కలెక్టర్ కి భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్

మాట్లాడుతూ జిల్లాలో పుట్టగొడుగుల కార్పొరేటు విద్యాసంస్థలు పుట్టుకోస్తున్నాయని ఎలాంటి అనుమతి లేకుండా శ్రీ చైతన్య పాఠశాల ఏర్పాటు చేసి వేల రూపాయలకు పుస్తకాలను అమ్ముకుంటూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పిల్లల తల్లిదండ్రులను మోసం చేస్తున్న.. అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. గత నెల రోజులుగా స్థానిక డిఇఓ, ఎంఈఓ కి వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోవడం లేదని అందుకే మళ్ళీ అధికారుల నిర్లక్ష్యం మరియు అనుమతి లేని శ్రీ చైతన్య పాఠశాల పై స్థానిక కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగిందని చెప్పారు.శ్రీ చైతన్య పాఠశాల లో విద్యా అర్హత లేనటువంటి టీచర్లను పెడుతూ ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోర్సులు అంటూ తల్లిదండ్రులను మోసం చేస్తూ వేళల్లో ముందస్తు ఫీజులు వసూలు చేసుకుని తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. ఇష్టరాజ్యాంగ జిల్లా కేంద్రంలో శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థ వ్యవహరిస్తున్న పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి అనుమతులు లేకుండా నడుస్తున్న వేములవాడ పట్టణ శ్రీ చైతన్య పాఠశాల మరియు ఇల్లంతకుంటల మండలంలోని శ్రీ చైతన్య పాఠశాలను మూసివేసి వెయ్యాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆయా పాఠశాలల ముందు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో బహుజన సేన జిల్లా అధ్యక్షులు జింక శ్రీధర్, భీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, నాయకులు సుదీర్, సంతోష్, వినయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### సునీల్ రావు ఆస్తులపై ఏసీబీ

## విచారణ జరిపించాలి



**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులతో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కసిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ కరీంనగర్ నగర కార్యవర్గ సమావేశం సోమవారం న్యాలపట్ల రాజు అధ్యక్షతన బద్దంఎల్లారెడ్డి భవన్ లొ జరిగింది.ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగర మాజీ మేయర్ సునీల్ రావు పదవీకాలంలో స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి రాజ్యమేలిందని కోట్ల రూపాయలు నీటిపాలు అయ్యాయని సునీల్ రావు టిఆర్ఎస్ పార్టీలో ఉన్నంతకాలం అవినీతి నోరు మెదపలేదని బిజెపిలో చేరి అవినీతి జరిగిందని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. సునీల్ రావు హాయంలో జరిగిన ప్రతి పనిలో పర్సెంటేజీల రాజ్యం నడిచిందని చిన్న చిన్న పనులకు కోట్ల రూపాయల బిల్లులు దొబ్బారని జంక్షన్ల లో రోడ్లు,డ్రైనేజీలు, వీధిదీపాలు, టాయిలెట్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ, ఫుట్ పాతుల, సైడ్ ట్రాక్స్, మానేరు రివర్ ఫ్రంట్,తీగల వంతెన నిర్మాణం తదితర పనుల్లో నాణ్యత కొరవడి పూర్తిగా అవినీతి జరిగిందని తెలిపారు. సునీల్ రావు నువ్వు ఏం పని చేస్తున్నావని నీకు కోట్ల రూపాలు ఆస్తులు వచ్చాయో ప్రజలకు వివరించాలని ఏమి పని చేయని నువ్వు కోట్ల రూపాయల బహుళ అంతస్తుల భవంతులు ఎలా నిర్మించావో ప్రజలకు వివరించాలన్నారు. దమ్ముంటేనీవు మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు దాఖలు చేసిన ఎన్నికల అఫీడవిట్ ను ఆస్తుల వివరాలను ప్రజల ముందు పెట్టినిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.రానున్న మున్సిపల్ ఎన్నికలకు సీపీఐ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ జెండాను కార్పొరేషన్ పై ఎగరేసేందుకుప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని అన్నారు.నగరంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. కరీంనగర్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటివరకు ఇవ్వకపోవడం ఇందిరమ్మ కమిటీలు వెయ్యకపోవడం వారి ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం అన్నారు. వెంటనే నగరంలో అర్హులైన ప్రజలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేకుంటే ప్రజా ఉద్యమాలు చేస్తామని సురేందర్ రెడ్డి హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బీర్ల పద్మ,కొట్టి అంజలి నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్తయ్య, కసిబోసుల సంతోష్ చారి, నునావతు శ్రీనివాస్, నగు నూరి రమేష్, ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అమెరికాకు తల ఒగ్గితే భవిత అయోమయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 జులై 8వ తేదీ నాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారతదేశానికి గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత బృందం, జేమీసన్ గ్రియర్ నేతృత్వంలోని అమెరికా బృందంతో వాషింగ్టన్‌లో 2 రోజుల చర్చలు జరిపింది. గోయల్ రెండు రోజుల క్రితం తిరిగి భారత దేశానికి వచ్చినప్పటికీ, వాణిజ్య కార్యదర్శి ఇంకా అమెరికాలో ఉన్నసమయంలో ట్రంప్ ఏకపక్షంగా భారతదేశంతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాడు. ఇందులో భారతదేశాన్ని మరింత తెరవాలని స్పష్టమైన సందేశం ఉంది. అయితే వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఇది ట్రంప్ 2025 మే 10న ప్రకటించిన అమెరికా -మధ్యవర్తిగా ఇండో -పాక్ కాల్పుల విరమణ, దానితో అనుసంధానించిన అమెరికా- భారత వాణిజ్య ఒప్పంద ప్రకటన కొనసాగింపే. ఇది మరోసారి ఆర్ఎస్ఎస్ ప్రేరేపించిన మోడీ పాలన అమెరికా సామ్రాజ్యవాదానికి చేసిన దౌర్భాగ్యకర నయా వలసవాదానికి తలవంచే విధానాన్ని బయటపెడుతోంది. 2025 ఏప్రిల్ 2న ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక షరతులు, పరిమితులు విధిస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశంలో భాగంగా ఉక్కు, అల్యూమినియంలపై 26% పన్నులు విధించడమే కాకుండా, భారత్‌లో తమ మార్కెట్‌కు అడ్డంకులు లేని ప్రవేశం కోసం డిమాండ్ చేశారు. ప్రపంచంలోని తూర్పున చైనా నుండి పశ్చిమ యూరప్, కెనడా వరకు పలు దేశాలు వెంటనే ప్రతిచర్యలు ప్రకటించాయి.లాటిన్ అమెరికా దేశాలు, ఆఫ్రికా దేశాలు కూడా ఈ ఏకపక్ష ట్రంప్ పన్నుల విధింపునకు వ్యతిరేకంగా గళమెత్తాయి. చైనా కౌంటర్ (ప్రత్యర్థిగా పన్నులుగా విధానానికి) టారిఫ్‌లకు ప్రతిచర్యగా ట్రంప్ చైనాతో రెండు దఫాల చర్చలతర్వాత వాణిజ్య ఒప్పందానికి వెళ్లాల్సి వచ్చింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి మాటలు పలికే మోడీ మాత్రం ట్రంప్ ఏకపక్షంగా బెదిరించే పద్ధతిలో పన్నులను విధించటం గురించి ఏమీ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో భారతదేశంలో తక్కువ వేతనంతో పని చేసే రంగాలైన టెక్స్‌టైల్, రత్నాభరణాలు, చర్మవస్తువులు, వస్త్రాలు, ప్లాస్టిక్, రసాయనాలు, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష, అరటిపండ్లపై అదనపు 26% పన్నుల నుండి పూర్తి మినహాయింపు కోసం వేడుకుంటుంటే, అమెరికా మాత్రం అధునాతన సాఫ్ట్‌వేర్‌లు, పరిశ్రమల వస్తువులు, ఆటో లు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్రో రసాయన ఉత్పత్తులు, వైన్, పాల ఉత్పత్తులు, ఆపిల్స్, ఇంతటితోనే కాకుండా జన్యుపరిణామం చేసిన పంటలపై డ్యూటీ మినహాయింపులు కోరుతోంది. ఈ ఒప్పందం ద్వారా 2025లో 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది లక్ష్యం. ఈ కొత్త ఒప్పందాన్ని 2025 జులై 8న ప్రకటించే అవకాశం ఉంది. స్వతంత్ర పరిశీలకుల ప్రకారం ట్రంప్ భారతదేశాన్ని మరింతగా తెరవాలి 'ఓపెన్ అప్ ఇండియా' అనేది 'స్టార్టప్ ఇండియా' చొరవను సూచిస్తుంది. ఇది స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన కార్యక్రమం. వ్యవస్థాపకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ఉద్యోగ సృష్టికర్తల దేశంగా మార్చడం దీని లక్ష్యం. ఈ చొరవ పన్ను మినహాయింపులు, నిధులకు సులభమైన ప్రాప్యత, మేధో సంపత్తి రక్షణకు మద్దతు వంటి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. కొత్తప్రకటన ఆధారంగా మోడీ పాలన అమెరికా ఉత్పత్తుల కోసం ఎర్రతివాచి పరచడానికి సిద్ధమవుతోంది. 2020 నివేదిక ప్రకారం ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారతదేశం 190 దేశాలలో 63వ స్థానంలో ఉంది. 2014లో 142వ స్థానం నుండి ఇది గణనీయమైన మెరుగుదల. 2021లో ప్రపంచ బ్యాంకు ఈ నివేదికను నిలిపివేసింది. కానీ అప్పటి వరకు భారతదేశం సాధించిన పురోగతి నియంత్రణ సంస్కరణలకు, మరింత వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో దాని నిబద్ధతను హైలైట్ చేసింది. ఫలితంగా భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావంపడడం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ (ఎఐ)వంటి సాంకేతిక విధానాలలో భారత్ కష్టపడి సాధించిన పురోగతిని దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతాయి. సోయాబీన్, మొక్కజొన్న, ఆపిల్స్, పాలు మొదలైన వాటిపై అమెరికా ఒత్తిడి వల్ల వచ్చే కొత్త పన్ను మినహాయింపుల మొదటగా నష్టపోయేది,బలిపశువులు అయ్యేది రైతాంగమే. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై తక్కువ పన్నులు, జిపి -(జెనిటికల్లి మాడిఫైడ్ -జన్యుపరంగా మార్పిడి చేయబడింది- ఉదాహరణకు బిటి విత్తనాలు-) విత్తనాల స్వేచ్ఛా ప్రవేశం, అమెరికా అగ్రిబిజినెస్, బహుళజాతి కంపెనీల (ఎంఎన్‌సిల) స్వేచ్ఛా విస్తరణ భారత వ్యవసాయానికి ఘోర విపత్తుకావడం ఖాయం. ఇది 2020 సెప్టెంబర్‌లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆదేశాల ప్రకారం కొవిడ్ సమయంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలను గుర్తుకు తెస్తోంది. అదే విధంగా రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అమెరికా -భారత పౌర అణు ఒప్పందాన్ని (సివిల్ న్యూక్లియర్ ఒప్పందాన్ని)కూడా ఈ వాణిజ్య ఒప్పందానికి అనుబంధంగా కలిపారు. దీనిలో భాగంగా అణుశక్తి చట్టాన్ని( అటామిక్ ఎనర్జీ చట్టం) సవరించడం, ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడం, న్యూక్లియర్ ప్రమాదం జరిగితే కంపెనీల బాధ్యతను తగ్గించేలా సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ (అణు నష్టానికి పౌర బాధ్యత చట్టాన్ని-) చట్టాన్ని సవరించడం మోడీ ప్రభుత్వం ప్రతిజ్ఞాబద్ధమైంది. 2025 బడ్జెట్‌లో విదేశీ న్యూక్లియర్ సంస్థలకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లు నిర్మించడానికి మార్గం ఇచ్చినది. సారాంశంగా చెప్పాలంటే మోడీ పాలనకు ఉన్న అమెరికా సామ్రాజ్యవాద విధేయతే ఈ ట్రంప్ విధానాలకు లొంగిపోవడంలో ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సమయంలో రైతులు, కార్మికులు, అశేష భారత ప్రజల జీవనాధారాలను తృణప్రాయంగా విస్మరించి అమెరికా సామ్రాజ్యవాదానికి బానిసగా మారటం అత్యంత దురదృష్టకరం.

# ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వాల బిక్షా కాదు..!

కాలం గడుపుతుందన్నారు. స్కాలర్షిప్ విడుదల చేయక పోవడంతో విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నాయి. ఈ సమస్యపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు. సకాలంలో స్కాలర్షిప్స్ రాక విద్యార్థుల జీవితాలపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ సకాలంలో చెల్లించకపోతే, విద్యార్థులు తమ కళాశాల ఫీజులను స్వంతంగా చెల్లించలేక, విద్యను మధ్యలోనే ఆపివేయాల్సి వస్తుంది. సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు ఆలస్యం కావడంతో లక్షలాది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు అప్పులు తీసుకోవడం లేదా పార్ట్-టైమ్ ఉద్యోగాలు చేయడం వంటి కఠిన ఎంపికలను ఎదుర్కొన్నారు, ఇది వారి విద్యా నాణ్యతను దెబ్బతీసింది. ఇది ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య వైఖరిని స్పష్టంగా కనిపిస్తుందన్నరు. ఈప్రభుత్వం ఈ స్కాలర్షిప్‌లను విడుదలలో పారదర్శకత లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు.ఇది ప్రభుత్వం యొక్క నీతి లేని రాజకీయ వైఖరిని బహిర్గతం చేస్తుంది అన్నారు.విద్యా సంస్థలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది.ఫీజు రియంబర్స్మెంట్ నిధులు సకాలంలో చెల్లించకపోతే, కళాశాలలు,విశ్వవిద్యాలయాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతాయి,ఇది విద్యా నాణ్యతను దెబ్బతీస్తుంది, ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం అవుతాయి,మౌలిక సదుపాయాల అభివృద్ధి స్తంభిస్తుంది.ఈ విధంగా, ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యా వ్యవస్థ మొత్తాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తుందని.అంతేకాక సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఎక్కువగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం తీసుకురావడం జరిగింది. కానీ నిధులు ఆలస్యం అవడం వల్ల ఈ విద్యార్థులు విద్యా అవకాశాలను కోల్పోతారు, ఇది సామాజిక ఎదుగుదలను అడ్డుకుంటుంది.ఇది ప్రభుత్వం యొక్క సామాజిక న్యాయ హామీలను ఒక ఊహాజనిత ఆలోచనగా మార్చేస్తుంది. ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడం అనేది ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం, అసమర్థత,స్పష్టంగా కనబడుతుందని వాపోయారు.ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బకాయిలను విడుదల చేయాలని లేకపోతే రాష్ట్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్,రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా,డివిజన్ అధ్యక్షులు జగన్ నాయక్,జిల్లా కమిటీ సభ్యులు న్యూమాన్,ప్రసన్న,సంపత్, డివిజన్ ఉపాధ్యక్షుడు అనిల్, డివిజన్ కమిటీ సభ్యులు అఖిల్,కోటేష్, సాయి, మణి, బన్నీ, తరుణ్ ,కిరణ్,వెంకటేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# వృక్షో రక్షతి రక్షిత:

సౌకర్యం కల్పించడమే కాకుండా, రాష్ట్రంలో వెయ్యి బస్సులను కొని స్వయం సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దెకు ఇచ్చారు. మహిళలు వ్యాపారాలు నిర్వహించడం ద్వారా బాగుంటుందని వారి చేతుల్లో పెట్టామని స్పష్టం చేశారు. హైటెక్ సిటీ వద్ద 3.5 ఎకరాల విలువైన స్థలంలో మహిళా సంఘాలకు కేటాయించి తద్వారా వారి ఉత్పత్తులను విక్రయించడానికి వీలు కల్పించామన్నారు. భారత్ సమ్మిట్, మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు అందరూ అక్కడికి వెళ్లి పరిశీలించారు. తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారనడానికి ఇదే ఉదాహరణ అని వెల్లడించారు. మహిళా సంఘాల్లో చేరడానికి కనిష్ట వయసును 15 సంవత్సరాలకు తగ్గించామన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల్లో సభ్యులను 67 లక్షల నుంచి కోటి మందికి పెంచి వారిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు ఈ ఏడాది 21 వేల కోట్ల రూపాయల మేరకు బ్యాంక్ లింకేజీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. నాతో పాటు వేదికపైన ఉన్న వారంతా ఇంట్లో ఏ బియ్యం తింటున్నామో ఆడబిడ్డలు కూడా ఆత్మగౌరవంతో ఉండే విధంగా సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో అక్కలు, ఆడబిడ్డలు ముందు ండాలి. ఆడబిడ్డలను కాపాడుకోవడమే ఇందిరమ్మ రాజ్యం ఉద్దేశమన్నారు. స్థానిక సంస్థల్లో స్వర్గీయ రాజీవ్ గాంధీ రిజర్వేషన్లు కల్పించినట్టుగానే భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభ జనలో మహిళలకు అసెంబ్లీ స్థానా ల్లోనూ రిజర్వేషన్లు పెరుగుతున్నాయి. ఆడబిడ్డలను గెలిపించుకునే పూచీ నాది. రానున్న రోజుల్లో ఆడబిడ్డలు రాజ్యాన్ని నడపాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య, పీజేటీఎస్ఏయూ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, పీసీసీఎఫ్ సువర్ణతో పాటు అటవీ శాఖ, హెచ్ఎండీఏ అధికారులు, వర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# టీబీ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి

అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిబి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల తీరుతెన్నులపై రెండు జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గవర్నర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్మూలనకు ఇరు జిల్లాల కలెక్టర్లు, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. దేశంలో టీబీ వ్యాధి నిర్మూలననే లక్ష్యంగా ప్రధాని టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం తీసుకువచ్చారని అన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు స్క్రీనింగ్ క్యాంపులను విస్తృతంగా నిర్వహించి టీబీ కేసులను గుర్తించాలన్నారు. ప్రజల్లో టీబీ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలన్నారు. టీబీ నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన పేషెంట్లకు దాతల ద్వారా పోషక ఆహార కిట్లను దాతల ద్వారా అందించాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 2,04,979 మంది హై రిస్క్ గ్రూపులో ఉన్నారని, అందులో 5,389 మందిని ఇప్పటివరకు పరీక్షలను నిర్వహించడం జరిగిందని, ఇందులో 176 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 594 మంది క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో జూన్ 2వ తేదీ నుండి టీబీ స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో 1.98 లక్షల మంది హై రిస్క్ గ్రూపులో ఉన్నారని, వీరందరిని స్క్రీనింగ్, ఎక్స్ రే చేసి లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 6923మంది కి స్క్రీనింగ్ పరీక్షలు చేయగా, ఇందులో 1389 మందికి ఎక్స్ రే పరీక్షలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎక్స్ రే పరీక్షలలో ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులనూ భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి తో పాటు పీఎంఎస్ఎస్వై , పరకాలలో ఏరియా ఆసుపత్రి, హనుమకొండలో టీబీ ఆసుపత్రి ఉన్నాయన్నారు. హనుమకొండలోని టీబీ ఆసుపత్రి, పరకాలలోని ఏరియా ఆసుపత్రిలో టీబీ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 720మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాకు రూ.60వేలు, వరంగల్ జిల్లాకు రూ. 40వేలను టీబీ పేషెంట్లకు పోషకాహార కిట్లను అందించేందుకు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుడా ఛైర్మెన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, అదేవిధంగా డాక్టర్ వాసవి రాకేష్ రెడ్డి దంపతులు హనుమకొండ జిల్లాకు రూ. 50 వేలను, డాక్టర్ వంగ హేమంత్ రెడ్డి రూ.20వేలను రాష్ట్ర గవర్నర్ సమక్షంలో కలెక్టర్లకు అందజేశారు. ముందుగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విచ్చేయగా హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు ఓరుగల్లు యొక్క ప్రత్యేకతను గుర్తుండేలా వరంగల్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన జి ఐ ట్యాగ్ పొందిన చెపాట మిర్చి, కాకతీయుల కళా తోరణం దేవత ప్రతిబింబించిన

ప్రసిద్ధ వరంగల్ చేనేత దర్రి జ్ఞాపికను అందచేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అడిషనల్ కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, డిఎంహెచ్వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, రెడ్ క్రాస్ సొసైటీ నుండి డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, రాష్ట్ర ఈసీ మెంబర్ ఇ.వి. శ్రీనివాస్ రావు, బిల్లా రమణారెడ్డి, ప్రభుత్వ వైద్య అధికారులు డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆచార్య, ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

**– నిరుపేద దంపతుల వేడుకోలు – జాబితాలో తమ పేరు తొలగించారని ఆవేదన**

**వేద న్యూస్, చొప్పదండి:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రొసీడింగ్ అందుకొని నిర్మాణ పనులు లబ్ధిదారులు సాగిస్తున్నారు. కాగా, ధర్మారం మండలం కమ్మర్ ఖాన్ పేట గ్రామంలో ఓ కుటుంబం తమ పేరు జాబితా నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి కథనం ప్రకారం..

కదాసీ మమత చంద్ర మోహన్ కి.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు మొదటి జాబితా లో పేరు వచ్చింది. ఆ తర్వాత లిస్టులో నుండి పేరును తొలగించడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లిస్టులో పేరు వచ్చిన తర్వాత దీనితో ఇంటి నిర్మాణం కోసం భూమిని సిద్ధం చేయించుకున్నామని చెప్పారు. తమ పేరును అకారణంగా తొలగించారని ఆ దంపతులు వాపోతున్నారు. ఈ విషయం గురించి హైదరాబాద్ లో ప్రజా భవన్ కు వెళ్ళి దరఖాస్తు చేసుకోగా, సీఎం ఆఫీస్ నుంచి లేఖలు రావడం తో అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారన్నారు. తాజాగా లబ్ది దారుల లిస్టులో కూడా పేరు రాలేదని వాపోయారు. ఈ లిస్టు లో పేరు విషయం పట్ల గత నెల 26 న కలెక్టర్ ను కలిసి తమ పరిస్థితి గూర్చి విన్నవించగా, ఇల్లు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు అని తెలిపారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకోని తమకు



ఇళ్లు మంజూరు అయ్యేలా చూడాలని కదాసీ మమత చంద్ర మోహన్ దంపతులు కోరుతున్నారు.

వేద న్యూస్

మంగళవారం, జులై 08, 2025



# నాన్ టీచింగ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ పూర్తి

**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ పోస్టు హెడ్ కుక్ -1 మరియు ఆదర్శ పాఠశాల లో నాన్ టీచింగ్ అసిస్టెంట్ కుక్ -2 గల వాటికి మండలంలోని మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు గత నెల 25 నుండి 27 వరకు (03) దరఖాస్తులు స్వీకరించారు. గడువు తేది లోపల 10 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం మండల విద్యాధికారి కార్యాలయం బోయినిపల్లి లో త్రిమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూ కి 10 మంది దరఖాస్తు చేసుకోగా (08) మంది మాత్రమే హాజరు కావడం జరిగింది. ఇట్టి ఇంటర్వ్యూ తహసీల్దార్ , మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాధికారి, ఆద్వర్యంలో జరిగింది. దరఖాస్తు దారులను విడి విడిగా పలు ప్రశ్నలు వేయడం జరిగిందన్నారు. త్రిమెన్ కమిటీ వారు వారి అభిప్రాయం మేరకు మార్కులు వేసి ఎంపిక ప్రక్రియ నిమిత్తం జిల్లాకు పంపించడం జరుగుతుందని మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమార్, తెలిపారు.

# ప్రజావాణిలో 95 ధరఖాస్తులు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

నూతన రేషన్ కార్డులు ప్రారంభించుటకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 14 న తిరుమలగిరికి విచేస్తున్న సందర్భంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ సి యం పర్యటనకి సంబంధించి అధికారులకి కేటాయించిన భాద్యతలు సక్రమంగా నిర్వహించి సి యం పర్యటనని విజయవంతం చేయాలని సూచించారు.అధికారులు క్షేత్ర స్థాయి లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి ధరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి, వేగవంతంగా ఆర్జిదారులకి సరియైన సమాధానం ఇవ్వాలని సూచించారు.ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యల పై 47,ఎంపిడిఓ లకి 13,డిపిఓ 10,శాఖలకు సంబందించినవి 25 మొత్తం 95 మొత్తం ధరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబందిత అధికారులకి పంపించటం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్ డి ఎ పిడి వివి అప్పారావు, డి పి ఓ యాదగిరి, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి,డి ఈ ఓ అశోక్, సి పి ఓ కిషన్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస నాయక్, జగదీశ్వర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 పిటిషన్లపై ముగిసిన వాదనలు



## - తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**వేద న్యూస్, డెస్క్:**

గ్రూప్-1 అంశంపై తెలంగాణ హైకోర్టు సోమవారంతో వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు తీర్పును రిజర్వ్ చేశారు. గ్రూప్-1 అంశంపై సుదీర్ఘంగా వాదనలు సాగాయి. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. మెయిన్స్ పత్రాలు పునః మూల్యాంకనం చేయాలని, మూల్యాంకనం చేయకపోతే మళ్లీ పరీక్షలు పెట్టాలని పిటిషనర్లు కోరారు. గతంలో గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చిన న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అదే సమయంలో స్టే ఎత్తివేయాలంటూ గ్రూప్-1కి ఎంపికైన పిటిషన్లు వేశారు. నియామకాలు పారదర్శకంగా జరిగాయని టీజీపీఎస్సీ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. వాదనలు ఏమైనా మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## అమరుల త్యాగఫలమే మాదిగల ఆత్మ గౌరవ

# వర్గీకరణ -విజయోత్సవ సంబరాలు

## - ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర నాయకులు దళిత రత్న నమిండ్ల చిన్నస్వామి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ జిల్లా ప్రగతి ఇండస్ట్రియల్ సర్కిల్ ఎఫ్ సిఐ గోదాం కూడలిలో సోమవారం ఆటో, హమాలీ, బార్దాన్, తాపీ మేస్త్రీల కార్మికులు, అంబేద్కర్ యువజన సంఘాలతో కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం వరంగల్ జిల్లా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దళిత రత్న నమిండ్ల చిన్నస్వామి మాట్లాడుతూ ప్రకాశంజిల్లా నాగులప్పలపాడు మండలం ఈదుముడి అనే గ్రామంలో

20 మంది దండోరా సభ్యులతో వ్యవస్థాపన మొదలై నేటికీ 31సంవత్సరాలు పూర్తిచేసుకుని 32వ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంలో ఎంతోమంది అమరుల త్యాగఫలమే నేటివర్గీకరణకు అనుకూలతీర్పు అని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల చట్టాలు,ఆర్డినెన్స్,జీవోలు, సాధించుకున్నామన్నారు.



మాదిగల ఆత్మగౌరవ వర్గీకరణ విజయోత్సవ సంబరాల కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్- టీఎస్ గీసుకొండ మండల అధ్యక్షులు కొమ్ముల ఏసేపు మాదిగ,పరకాల నియోజకవర్గంఇన్చార్జి కోట బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ 17డివిజన్ అధ్యక్షులు ఇసంపల్లి కరుణాకర్, అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి ఇసంపెల్లి సాంబయ్య, నర్మెట శ్రావణ్, నిక్కు కాంగ్రెస్ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా నాయకులు బొడ్డు కరుణాకర్, ఆకుల పెల్లి ఎల్లయ్య, దౌడు నరసయ్య, బొజ్జ రమేష, సారయ్య, నర్మెట్ట స్టీ పెన్,తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో బీరన్న బోనాలు విజయవంతం

**వేద న్యూస్, కరీమాబాద్ :**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కరిమాబాదులో కురుమ కులస్తులు నిర్వహించిన బీరన్న బోనాల ఉత్సవం అందరి సహకారంతో విజయవంతం అయిందని ఆలయ కమిటీ అధ్యక్షులు కోరే కృష్ణ కురుమ తెలిపారు. సోమవారం బీరన్న కుంటలోని ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా కోరె కృష్ణ మాట్లాడుతూ ఆలయ హుండీలో విదేశీ కరెన్సీ తో కలిపి 86,690 రూపాయలు మరియు 6తులాల వెండి వచ్చాయన్నారు. జాతర విజయవంతానికి సహకరించిన వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్, మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్, కార్పొరేటర్లు పల్లం పద్మ, మరుపళ్ళ రవి, వరంగల్ మహానగరపాలక సంస్థ అధికారులు మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కడారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మురికి రాజు, సహాయ కార్యదర్శి దయ్యాల సుధాకర్, కోశాధికారి నరిగే లక్ష్మణ్, కుల పెద్దలు దయ్యాల పురుషోత్తం, మండల రాజు, ముఖ్య సలహాదారులు కంకల మల్లేశం, మండల కొమురెల్లి కోర కుమారస్వామి, బండారి రాజేశ్వర్, ఆర్గనైజర్స్ నంద నవీన్, గొట్టే సదానందం,గొట్టే మల్లేశం, కార్యవర్గ సభ్యులు కంచ తిరుపతి, వాసవి శ్రీనివాస్, ఎమ్మే వేణు, కోరే రమేష్, అన్న శ్రీనివాస్, మురికి చిన్న రవి, కంచ మెట్టయ్య, కొమ్ము




రాజు, కాటన్ సతీ,ష్ బండారి మల్లేశం,కురుమ కులస్తులు పాల్గొన్నారు.

## ఫుడ్ ఇన్ స్పెక్టర్ తనిఖీలు

# నిర్వహించాలి

## - తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డు లో గల రాయల్ బేక్స్ లో తిను బండారాల పై ఎలాంటి తయారీ, ఎక్స్పైర్ తేదీలు లేని తినుబండారలను విక్రయి స్తున్నారని, సదరు బేకరీ పై చర్యలు తీసుకోవాలనీ తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము కోరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణానికి రోజు వేలాదిమంది విద్యార్థులు, వివిధ రకాల ప్రజలు పనుల నిమిత్తం వస్తూ ఉంటారనీ,. స్నాక్స్ రూపకంగా ఆకలి తీర్చుకునేందుకు బేకరీ కి వెళ్తే తినుబండారాలపై ఎలాంటి తయారు చేసిన తేదీ ఎక్స్పైర్ అయ్యే తేదీలు లేకుండా అమ్ముతున్నారని చెప్పారు. ఇలాంటి అమ్మకాల వల్ల పేద ప్రజలు,విద్యార్థుల ఆరోగ్యాలు, రోగాల బారినపడుతున్నరనీ ఆసుపత్రిలో పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్థానిక ఎమ్మార్వో, ఫుడ్ ఇన్ స్పెక్టర్ స్పందించి, తనిఖీలు నిర్వహించి నాణ్యతలేని తినుబండారా లు అమ్మే, బేకరీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఒకే ఒక అస్తికయినా ఇవ్వండి

వేద న్యూస్, హైదరాబాద్ : సిగాచి పరిశ్రమ లాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదు. ఎక్కడి నుంచో పొట్టకూటి కోసం వచ్చిన కార్మికులు అగ్నికి ఆహుతి అయ్యారు. చెట్టంత మనిషిని, చివరికి మాంసం ముద్దలాగా ఓ చిన్న పెట్టెలో పెట్టి ఇస్తే ఆ కుటుంబ సభ్యుల ఆవేదన అంతా ఇంతా కాదు. సిగాచి ప్రమాదంలో ఆప్తులను కోల్పోయిన వారి వేదన మాటల్లో వర్ణించలేం. మరణించిన వారిని కడసారి చూసుకునే అవకాశమూ దక్కలేదని చాలా మంది తల్లిడిల్లుతున్నారు. ఇప్పటి వరకు 42 మంది చనిపోయారని అధికారులు ప్రకటించారు. వీరిలో అత్యధికుల మృతదేహాలను వస్త్రాల్లో కట్టి ఇచ్చేశారు. ముఖాలనూ గుర్తుపట్టలేని పరిస్థితి ఉండటంతో.. అలాగే తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. ఈ ప్రమాదంలో ఆచూకీ గల్లంతయిన తొమ్మిది మందికి సంబంధించి కేవలం ఎముకలు, ఇతరత్రా అవశేషాలు మాత్రమే దొరికాయి. ఒకే ఒక్క అస్తిక ఇచ్చినా, అంత్యక్రియలు నిర్వహించి, వారి ఆత్మలు శాంతించేలా చూస్తామని కుటుంబసభ్యులు రోదిస్తూ వేడుకుంటున్నారు. ప్రమాదస్థలిలోని శిథిలాలను అధికారులు జల్లెడ పట్టారు. మట్టిని కూడా తవ్విపోశారు. ఎట్టకేలకు పదుల సంఖ్యలో ఎముకలు, ఇతర అవశేషాలను సేకరించారు. డీఎన్ఏ పరీక్షలకు పంపారు. ఆ ఫలితాలను రక్తసంబంధీకుల డీఏఎన్ తో మ్యాచ్ చేస్తున్నారు.

# స్వర్ణకారులపై వేధింపులు మానుకోవాలి



## - కేసులకు భయపడి స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

## - ఎమ్మెల్సీ కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ :**

పోలీసులు స్వర్ణకారులను వేధించడం మానుకోవాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కేసులకు భయపడి స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. బంగారం వృత్తి చేసుకునే వారికి సర్కారు రుణాలు ఇవ్వాలని, కార్పొరేట్ సంస్థల తో పోటీపడేలా విశ్వకర్మల కు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న స్వర్ణకారుల ఆత్మహత్యలు కలిచి వేస్తున్నాయని కవిత ఆవేదన వ్యక్తంచేశారు. విశ్వకర్మ వృత్తుల వారు యావత్ దేశానికే ఊపిరి పోస్తున్నారని, కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో ఆయా వృత్తులకు ఆదరణ తగ్గిపోయిందని అన్నారు. క్రమేణ వృత్తిపని చేస్తున్న వారికి ఉపాధి లేకుండా పోతోందని, వారి జీవనం నడవడమే ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు.

మన దేశంలో బంగారానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, నగలను ఎంతో పవిత్రంగా చూస్తారని, కేవలం స్వర్ణకారులే కాకుండా ఇతర కులాల వారు కూడా ఈ వృత్తిని ఉపాధిగా మార్చుకున్నారని, మహిళగా మెట్టెలు, మంగళసూత్రాలు చేయించాలంటే స్వర్ణకారుడి దగ్గరికి వెళ్తామే తప్ప పెద్దపెద్ద షాపులకు వెళ్లమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. భారతీయులు పవిత్రంగా భావించే బంగారు, వెండి ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. దొంగ బంగారం కొన్నారని పోలీసులు స్వర్ణకారులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఆ బంగారం అమ్మిన దొంగలను మాత్రం పట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక కొందరు స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. తాను నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో స్వర్ణకారులను పోలీసులు ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకున్నానని గుర్తుచేశారు. స్వర్ణకారులను వేధింపులకు గురిచేస్తున్న 411 చట్టానికి సవరణలు చేయాలని డిమాండ్ చేస్తున్నానని, ఏపీలోనూ 411 చట్టం కింద కేసులు పెట్టి స్వర్ణకారులను వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఎమ్మెల్సీగా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా, బీసీల కోసం ఉద్యమిస్తున్న నాయకురాలిగా ఈ చట్టం సవరణ కోసం పోరాడుతానని ఆమె హామీ ఇచ్చారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073